క్రీడా పండుగకు వేళాయె



యోగా నేర్పిస్తున్న శిక్షకులు



క్యారమ్ నేర్పిస్తున్న శిక్షకులు

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు
- మే 1 నుంచి 31 వరకు శిక్షణ
- 50 క్రీడాంశాల్లో శిక్షణ

మదనపల్లె సిటీ : వేసవికాలం వచ్చిందంటే చాలు వేసవి శిక్షణ శిబిరాల కోసం విద్యార్థులు ఎదురు చూస్తుంటారు. గత ఏడాది కాస్త ఆలస్యంగా ప్రారంభమైనా ఈ సారి పక్కా ప్రణాళికలతో క్రీడా పండుగ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచితంగా క్రీడా శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 5 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. క్రీడా శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న సీనియర్ క్రీడాకారులు ఈ శిబిరాలు నిర్వహించేందుకు అర్హులు. నెల రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు ధ్రువీకరణ పత్రం అందించనున్నారు.

పాఠశాల మైదానాల్లో..

పాఠశాల, కళాశాల సెలవులతో బోసిగా మారే మైదానాలు వేసవి శిక్షణ శిబిరాలతో కళకళలాడనున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మైదానాలు ఇందుకు వేదికగా మారనున్నాయి. ఆసక్తిగల వ్యాయామ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో శిబిరాలు నిర్వహించనున్నారు.

వేసవి సెలవులంటేనే శిక్షణ శిబిరాలు :

ఏటా పాఠశాలలకు వేసవి సెలవులంటేనే గుర్తుకొచ్చేది క్రీడా శిబిరాలు. విద్యార్థులు బయట తిరిగి ఎండలకు అనారోగ్యానికి గురికాకుండా ఎంతగానో ఉపయోగపడతాయి. క్రీడలపై ఇష్టమున్న వారికి ఈ శిబిరాలు ఓ మెట్టులా ఉపకరిస్తాయి. అందుకే తల్లిదండ్రులు సైతం పిల్లలను ఈ శిబిరాలకు పంపేందుకు ఆసక్తి చూపుతారు. దాదాపు నెల రోజుల పాటు క్రీడాకారులు మెలకువలు నేర్చుకుంటారు. గత ఏడాది మదనపల్లెలో హాకీ, ఫుట్‌బాల్, రాయచోటిలో క్రికెట్, కబడ్డీ, రాజంపేటలో బ్యాల్‌బాడ్మింటన్, క్రికెట్, పీలేరులో యోగా వంటివి శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈసారి 50 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో శిబిరంలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు.

క్రీడాంశాలివే..

హాకీ, ఫుట్‌బాల్, ఖోఖో, బాస్కెట్‌బాల్, రోప్ స్కిప్పింగ్, యోగా, కరాటే, తైక్వాండో, క్రికెట్, ఫెన్సింగ్ బాల్‌బాడ్మింటన్‌తో పాటు పలు క్రీడలు వేసవి శిక్షణ శిబిరంలో నేర్పిస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం



వేసవిలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాలని శాప్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు చర్యలు ప్రారంభించాం. జిల్లా వ్యాప్తంగా 50 శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించాం. ఈ మేరకు ఆసక్తిగల శిక్షకుల నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. వారి దరఖాస్తుల మేరకు శిబిరాల నిర్వహణకు అవసరమైన సదుపాయాల కల్పనకు శాప్‌కు నివేదిస్తాం. ఆసక్తిగల శిక్షకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-షేక్ షఫీ, చీఫ్ కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ

చేసిన మంచిని ప్రజలకు వివరిద్దాం

ఎమ్మెల్యే నవాజ్ బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : నాలుగేళ్ల కాలంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ఇంటింటికి వెళ్లి వివరించి చెప్పాలని ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. మంగళవారం స్థానిక జేసీఎం టౌన్‌హాల్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' ప్రచార కార్యక్రమం నియోజకవర్గ స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఏపీ ఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ మనూజారెడ్డి, వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతిలతో కలిసి ఆయన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నూతనంగా ఎంపిక చేసిన మండల సచివాలయ కన్వీనర్లు, మున్సిపల్ సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేదీ నుంచి గృహ సారథులతో కలిసి ఇంటింటికి వెళ్లాలన్నారు. ప్రతి పంచాయతీ స్థాయిలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి గత టీడీపీ ప్రభుత్వం ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాలు చేసే అబద్ధపు, విష ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు బలంగా తిప్పి కొట్టాలన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో 175కు 175 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అలంబనగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి, గారబురుజు రమణారెడ్డి, ఎంపీపీ నరసింహులు, వెలుగు చంద్ర, వైస్ ఎంపీపీ రమణ, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్లు రామ్మోహన్‌రెడ్డి, నంద, మున్సిపల్ సచివాలయ కన్వీనర్లు నాగరాజు, మునిశేఖర్, కౌన్సిలర్ ఎస్వీ రమణ, భాస్కర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి సత్వర చర్యలు

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి సత్వర చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఎమర్జెన్సీవార్డు, ఓపీ, అడ్మిషన్ వార్డు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వార్డుల్లో పర్యటించి రోగులను పరామర్శించారు. అనంతరం డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవిలతో కలిసి వైద్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన అభివృద్ధి పనులను సమీక్షించారు. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. ఇటీవల ఆసుపత్రిలో నగదు వసూళ్లకు పాల్పడిన సిబ్బందిపై చేసిన విచారణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటీవల ఆసుపత్రిలో నగదు వసూళ్లకు పాల్పడిన అరుగురిపై డాక్టర్ పాల్ రవికుమార్ విచారణ ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. సదరు సిబ్బందిని స్థానచలనం చేసి ఇతర విధులను అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో దివాకర్, వైద్యులు పాలరవికుమార్, నర్సింగ్ సూపరింటిండెంట్ నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

మదనపల్లె : మదనపల్లె డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎంఎస్. మురళి, ఐసీడీఎస్ జిల్లా ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు. డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, వాల్మీకిపురం ప్రాజెక్టు పరిధిలోని ఏడు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 29 మంది దరఖాస్తు చేసుకోగా 18 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. 28 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 49 మందికిగాను 33 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూ ఫలితాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మి, సీడీపీవోలు సుజాత, నాగవేణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవం

వాల్మీకిపురం: మండలంలోని శివపురం గ్రామంలో శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాన్ని తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని గుండ ప్రవేశం, జ్యోతి ప్రసాదం వినియోగం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అక్రమ మద్యం ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లను మండల కేంద్రంలో మంగళవారం ధ్వంసం చేశారు. మదనపల్లి ఈఎస్ మధుసూదన్, ఏఈఎస్ రాధాకృష్ణ సమక్షంలో 2019 ఏడాది నుంచి 2022 వరకు పట్టుబడిన రూ.12 లక్షలు విలువజేసే 88 బాక్సుల కర్ణాటక మద్యం, 530 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక చెప్పారు.

సచివాలయం తనిఖీ

మదనపల్లె : మండలంలోని పొన్నూటిపాళ్యం సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం సచివాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీల్లో గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. అక్కడ ఎరువుల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి సుశీల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూరక్ష పథకంతో సంపూర్ణ హక్కులు

కలకడ : వైఎస్సార్ జగనన్న భూరక్ష తో రైతులకు వారి భూముల సంపూర్ణ హక్కు, రక్షణ కలుగుతుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోతువారిపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలో డిజిటల్ సర్వే చేసిన భూమికి తహసీల్దార్ రాము, రెవెన్యూ బృందం చూపిన హద్దుల మేరకు భూ రక్ష రాతిని ఏర్పాటు చేశారు. సమగ్ర భూరక్ష పథకం ప్రకారం సాగు భూమిని రైతులకు అన్ని రకాలుగా రికార్డులు, ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఇకపై తప్పుడు ధ్రువపత్రాలు చెల్లవని, ఆస్తి స్థిర విలువతో అన్ని చోట్ల ఒకే రికార్డు, ఆధే రుజువులు ఉంటాయని తెలియజేశారు.

ఘనంగా నల్లగంగమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

రామసముద్రం: మండలంలోని చెంబకూరు పంచాయతీ పాతూరు దళితవాడలో మంగళవారం పెద్ద ఎత్తున గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు అభిషేక కార్యక్రమాలు చేపట్టి, పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆష్టైశ్వరాలు, సిరి సంపదలు కలిగి సుఖసంతోషంగా ఉండాలని గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు దీపాలు మోసి మొక్కులు చెల్లించారు. బంధుమిత్రులు రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

మామిడి యాజమాన్య పద్ధతులపై శిక్షణ

కలికిరి: మామిడి యాజమాన్య పద్ధతులపై మండలంలోని గుట్టపాళెం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎంవీ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం మామిడిని పండు ఈగ ఆశించే అవకాశాలు అధికంగా ఉన్నందున ముందస్తు యాజమాన్య పద్ధతులు, ఫ్రూట్ కవర్‌ల వినియోగంతో పంట నాణ్యతతో పాటు పండు ఈగ, అకాల వర్షాల నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. అనంతరం వరి, టమాటా యాజమాన్య పద్ధతుల గురించి తెలియజేశారు. చిరుధాన్యాల సాగుపై రైతులను చైతన్య పరచాలని ఆర్బీకే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసన్న, వీఏఏ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ వ్యాఖ్యలు అర్థరహితం

- హెరిటేజ్ కోసం విజయా డైరీని నాశనం చేసింది చంద్రబాబే
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం: నారా లోకేష్‌కు రాజకీయంగా ఏ మాత్రం అవగాహన లేదు ఎవరో ఏదో స్క్రిప్టు రాసిస్తే టీడీపీ ఉనికి కోసం వ్యాఖ్యలు చేసుకుంటూ పాదయాత్ర సాగిస్తున్నాడని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీలో భాగంగా మంగళవారం ఆయన పీటీఎం, కందుకూరు గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత హెరిటేజ్ డైరీ కోసం విజయా డైరీని నాశనం చేసింది చంద్రబాబు అని తెలిసి కూడా లోకేష్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఎద్దేవా చేశారు. పక్కా గృహాల మంజూరులో కూడా రాష్ట్రంలోనే అత్యధికంగా గృహాలు మంజూరైంది తంబళ్ళపల్లెకే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికి నీరు, రోడ్లు, విద్యుత్‌సౌకర్యాలు కల్పించడమే ధ్యేయమన్నారు. మండలంలో 824 మహిళా సంఘాల్లోని 7,493 మంది లబ్ధిదారులకు రూ.5.85 కోట్ల వైఎస్సార్ ఆసరా మూడో విడత ఆసరా నిధులు వారి ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా 13,500 మంది రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా మండలంలో 105 కిలోమీటర్ల వరకు లింక్ రోడ్లకు రూ.58 కోట్లు వెచ్చించామన్నారు. అనంతరం ఆయన సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి మెగా చెక్కును ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

-ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పొదుపు సంఘాలు దేశంలోనే అగ్రగామిగా నిలిచాయని తెలిపారు. మహిళలు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాలు నిర్వీర్య దశకు చేరుకున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. మహిళల రక్షణకు, ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మహిళ రక్షణకు దిశ యాప్, మహిళల పేరుతోనే ఇళ్ల స్థలాలు, బిల్లులు, పేదరిక నిర్మూలనకు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని 1274 పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రూ. 13.87 కోట్లు వైఎస్సార్ చెక్కును పంపిణీ చేశారు. అనంతరం స్థానిక వారపుసంత, దినసరి మార్కెట్ గేటు వసూళ్ల హక్కుకు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సొంతనిధులు రూ. 15 లక్షలు పంచాయతీ సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డిలకు ఎమ్మెల్యే అందజేశారు. వారపుసంతలో రైతులు, వ్యాపారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, హరిణి, జయలక్ష్మీదేవి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, వైస్ ఎంపీపీలు ఎస్.వి. చలపతి, హరిత, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మహిళానంద్, ఉదయ్‌కుమార్, వెలుగు ఏరియా కోర్డినేటర్ రూతు, ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కలకడ : ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కె.బాటువారిపల్లె పంచాయతీ కలకడ హరిజనవాడ, అక్కగారికోట, అక్కన్నగారికోట హరిజనవాడలో గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరించే అవకాశం ఉన్న వాటిని అక్కడికి అక్కడే పరిష్కరించారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేశారు. కలకడ దళితవాడలో 110 కుటుంబాలకు అందించే మంచినీటి స్కీం బోర్ తాళం టీడీపీ నాయకుల చేతిలో గత మూడు సంవత్సరాలుగా ఉండిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే గ్రామానికి మంచినీరు అందించేలా చూడాలి, లేకుంటే అధికారులపై చర్యలు తప్పవని ఆదేశించారు. మరి కొందరు ఇంటినిర్మాణం కోసం పట్టాలు, పొజిషన్ ధ్రువపత్రాలు కావాలని కోరినా మంజూరు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజు, ఈశ్వర్‌నాయుడు, హరిప్రసాద్‌నాయుడు, షౌకత్‌అలీఖాన్, సుల్తాన్‌బాషా, కరీముల్లా, జయప్రకాష్, జీవులక్రిష్ణ, బయన్న, రవికుమార్, నాగరాజ, జీవికిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్లు

గుర్రంకొండ: ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద పిల్లలకు ఉచితంగా ఇవ్వాలని ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గుర్తింపుపొందిన ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం తప్పనిసరిగా 25 శాతం సీట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పేదపిల్లలకు ఉచితంగా ఇచ్చే 25శాతం సీట్లకు ఫీజులు ప్రభుత్వమే ఆ పాఠశాలల యాజమన్యానికి చెల్లిస్తుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 10 తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ విషయమై గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కేవీపల్లె : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏపీ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతితోపాటు ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే 6, 7, 8వ తరగతులలో మిగిలివున్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మే నెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో తనిఖీ



ప్రైవేట్ ఆసుపత్రిలో ఆడిట్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

మదనపల్లె : పట్టణంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో జిల్లా డీఎంహెచ్ఓ కొండయ్య, మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మి, జిల్లా ఇమ్యునిటీ అధికారి ఉషశ్రీ, రెండు బృందాలుగా తనిఖీ నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ చికిత్సలపై ఆడిట్ నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలో సాధారణ కాన్పులను సిజేరియన్ కాన్పులుగా నమోదు చేసి ఆరోగ్యశ్రీలో బిల్లులు దండుకుంటున్నట్లు ఆరోపణలు రావడంతో జిల్లా వైద్యాధికారులు ఆడిట్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కొండయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ విభాగంలో నిధుల వినియోగంపై వార్షిక ఆడిట్‌లో భాగంగా ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించి వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆడిట్‌లో లోపాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను మరింతగా ప్రజలకు చేర్చే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఆంజనేయులు, వెంకటశివ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ మల్లిక

నిమ్మనపల్లె : గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీహెచ్‌వో మల్లిక అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ జులేకాబేగం ఆదేశాలతో ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గర్భవతులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. బాలింతలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలన్నారు. తల్లి బిడ్డలకు అందించే వైద్య సేవల వివరాలను ఎంసీపీ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. మాతా శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో రామచంద్ర, పీహెచ్ఎన్ సరోజ, సూపర్‌వైజర్ దేవకుమారి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సహకారం అభినందనీయం

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు రెవెన్యూ గ్రామ పంచాయతీ రైతుల సహకారం అభినందనీయమని తహసీల్దార్ కళావతి తెలిపారు. మంగళవారం గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా సమగ్ర భూ సర్వే కన్నెమడుగులో చేపట్టడం హర్షణీయమన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో సమగ్రభూ సర్వే పూర్తి చేసి రైతుల భూములకు హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కన్నెమడుగు బస్టాప్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్‌లు, సర్వేయర్ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి సాకెమ్మ, జ్ఞానారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం లక్ష్యాలు సాధించాలి

డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్



మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

వాల్మీకిపురం: జాతీయ కార్యక్రమాల్లో వందశాతం లక్ష్యాలు సాధించాలని జిల్లా డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీలో జరుగుతున్న ఆశా దినోత్సవాన్ని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాకార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు వారి వారి నిర్దేశిత విధుల్లో వందశాతం లక్ష్యాలు సాధించాలన్నారు. ప్రతి గర్భిణికి వారి మొబైల్‌కు వచ్చే కిల్కారి సేవలు గురించి గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కిల్కారి సేవలు అనగా గర్భం ధరించినప్పటి నుంచి ఆరోగ్యం పట్ల పాటించాల్సిన జాగ్రత్తలు గురించి మొబైల్ ద్వారా అవగాహన కలిస్తారన్నారు. హెల్త్ ఐడిలు ప్రతి పౌరునికి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, సీహెచ్ఓ ఇందిరారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ పూర్ణమ్మ పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

ఎంపీపీ లక్ష్మీనరసనమ్మ



ఉచిత విద్య పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బి.కొత్తకోట: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలంలో సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ లక్ష్మీనరసమ్మ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో నీటి సమస్యలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో మండలం ప్రగతి సాధిస్తోందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఎంఈఓ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ విద్యా హక్కుచట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందిస్తోందన్నారు. 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, బీరంగి కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గుడిపల్లె సర్పంచ్ గిరిజ మాట్లాడుతూ తమ గ్రామానికి సంబంధించిన హౌసింగ్ లబ్ధిదారుల వివరాలు, ఎవరికి పక్కా గృహాలు మంజూరయ్యాయో అధికారులు చెప్పడం లేదన్నారు. తుమ్మణంగుట్ట సచివాలయంకు తాగునీరు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ ఖాదర్‌వలి కోరారు. తహసీల్దార్ ధనుంజయులు, జెడ్పీటీసీ రామచంద్ర, ఎఈలు దినేష్, లావణ్య, ఏఓ మురళీమోహన్, ఎంపీటీసీలు గౌతమి, రామప్పనాయుడు, యల్లప్ప, ఈశ్వరమ్మ, రమాదేవి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత సీట్లపై పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు.

వైభవంగా రాములోరి కల్యాణం

కురబలకోట: కురబలకోటలోని శ్రీ కోదండ రామస్వాముల వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ జయరామ జయ జయరామ అన్న భక్తుల నామస్మరణతో ఆలయం మారుమోగింది. వరుడిగా రాముడు, వధువుగా సీతమ్మను చూసిన భక్తులు పులకరించారు. మంగళవాయిద్యాలు వేద మంత్రాల నడుమ మధ్య వైభవంగా కల్యాణోత్సవం జరిగింది. అనంతరం స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. బుధవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మైక్రో ఇరిగేషన్‌తో ఆదాయం

కలికిరి: మైక్రో ఇరిగేషన్, ఫర్టిగేషన్‌తో పంటలలో రైతులు సాధారణంగా కంటే అధిక ఆదాయం పొందవచ్చని కేవీకే సమన్వయకర్త పాండురంగ అన్నారు. స్థానిక కేవీకేలో మైక్రో ఇరిగేషన్, ఫర్టిగేషన్ పద్ధతుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశానికి హాజరైన మైక్రో ఇరిగేషన్ జిల్లా సమన్వయకర్త హరినారాయణ రైతులనుద్దేశించి మాట్లాడారు. డ్రిప్ ద్వారా మామిడి, టమాటా, బొప్పాయి, అరటి, నిమ్మ తదితర పంటలకు ఎరువుల యాజమాన్యం, స్క్రీన్ ఫిల్టర్, గ్రావెల్ ఫిల్టర్, సూక్ష్మనీటి పారుదల పద్ధతులను తెలియజేశారు. మంగళవారంతో శిక్షణ ముగిసింది. కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జ్ వై.పీరు సాహెబ్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.